42.

# సత్సంకల్పములే మానవతా విలువలు

దైవాధీనం జగత్సర్వం సత్యాధీనంతు దైవతమ్
తత్ సత్యముత్తమాధీనం ఉత్తమః పరదేవతా.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా, విద్యాబోధకులారా, విద్యాభిమానులారా!

ప్రపంచమంతయు కూడను దైవాధీనము అయియున్నది. ఈ దైవము సత్యాధీనమై ఉన్నాడు. సత్యము ఉత్తముడియొక్క అధీనమైయున్నది. అట్టి ఉత్తములే దైవస్వరూపులు. ఈనాటి మానవులు, దివ్యత్వాన్ని గుర్తించుకొనలేక, దైవత్వాన్ని అర్థం చేసుకొనలేక కాలమును, కర్మను, కర్తవ్యమును కూడను వ్యర్థము గావించుకుంటున్నారు. వ్యక్తియొక విలువ కేవలము విద్యపైన మాత్రమే ఆధారపడలేదు. సంస్కారంపై ఆధారపడి యున్నది. ఈ సంస్కారము అనగా ఏమిటి? ప్రతి మానవుడు తన నిత్య జీవితములో పొందినటువంటి దురలవాట్లను, దుశ్చర్యలను దూరము గావించుకుని, సదలవాట్లను, సత్కార్యలను అలవరచుకోవటమే సంస్కారము. ప్రపంచము మానవునియొక్క చర్యపైన ఆధారమపడి ఉన్నది. మానవుని చర్యలు ఉత్తమమైన చర్యలుగా ఉండినప్పుడు దేశము ఉత్తమమైన దేశముగా రూపొందుతుంది. ఇట్టి ప్రవర్తనలు ఆలోచనలపై ఆధారపడి ఉన్నది. కనుక మానవునియొక్క సంకల్పములు, సత్సంకల్పములుగా మార్చుకోవాలి. ఈ సత్సంకల్పములే మానవతా విలువలు. ఐతే ఈనాటి ప్రపంచము ఉండవలసిన రీతిగా ఉండటం లేదు అంటే దీనికి కారణము ఏమిటి? దీనికి మానవుడు ఉండవలసినటువంటి స్థితిలో ఉండటం లేదు. మానవులయొక్క సంకల్పములు సరిఅయిన సంకల్పములుగా ఉండటంలేదు. మానవునియొక్క చర్యలు ఉత్తమము అయిన చర్యలుగా రూపొందటంలేదు. మానవుడు ఈ జగత్తులో మెలగవలెనన్న మానవతా విలువలను ఆచరణలో పెట్టాలి. మానవతా విలువలు ఈనాడు ఆచరణలో లేకపోవటం చేతనే ప్రపంచము ఇన్ని విధములైనటువంటి దురవస్థలకు గురి అవుతున్నది.

sri sathyasai vahanamrutam

## ప్రవృత్తి-నివృత్తి లక్షణాలు

ప్రతి మానవునియందు, తల, హృదయము ఈ రెండు చాలా ప్రధానమైన టువంటివి. తలనుండి వెలువడే సంకల్పములు అన్నీ కూడను భౌతికమైనవి. తాత్కాలికమైనవి. ఇవి ప్రవృత్తి లక్షణాలు. చదవటము, వ్రాయటము, తినటము, తిరగటము, సంపాదించుకోవటము, కూడబెట్టుకోవటము ఇవన్నీకూడను ప్రవృత్తి లక్షణములే. ఇవన్నీకూడను తలనుండి ఆరంభమయ్యేవి. కాని, పవిత్రమైన భావములు హృదయమునుండి ఆవిర్భవిస్తుంటాయి. దయ, ప్రేమ, సహనము, సానుభూతి, సత్యము ఇత్యాది పవిత్రమైనటువంటి గుణములు హృదయమునుండి వెలువడుతుంటాయి. వీటినే నివృత్తి లక్షణములు అని చెప్తారు. ప్రపంచమంతయు ప్రవృత్తి, నివృత్తుల సమ్మిళితమైన స్వరూపమే. ఇందులో ఏ ఒక్కటి లేకపోయిననుకూడను మానవుడు ఈ జగత్తులో నిలువజాలడు. అయితే మానవునియొక్క సంకల్పములు పవిత్రమైనటువంటి సంకల్పములుగా రూపొందింపచేసుకోవాలి. మొక్క వృక్షమై ఫలపుష్పములను ఏ రీతిగా అందిస్తున్నదో సంకల్పములు కూడను ఆ విధముగా ఉత్తమమైనటువంటి సంకల్పములుగా రూపొంది తద్వారా క్రియా రూపమును ధరించును. ఆ క్రియయొక్క ఫలితమే మానవునియొక్క మంచి చెడ్డలు. మానవుడనగా మనసు, దేహము, ఆత్మ. ఈ మూడింటియొక్క సమ్మిళిత స్వరూపుడు, మానవుడు. దేహమును ఆధారము చేసుకుని మనసు తన కర్తవ్యమును నిర్వర్తిస్తున్నది. కనుక మొట్టమొదట దేహము. ఇది చేయుట. మనసు తలంచుట. ఆత్మ ఉండుట. చేయుట, తలంచుట, ఉండుట వీటి ఆకారమే మానవత్వము. అయితే ఈ మానవత్వములో కొన్ని విధములైనటువంటి దురవస్థలు కూడను ఆవిర్భవిస్తుంటాయి. ఈ దేహము మనసుతో ఆత్మతో ఎట్టి సంబంధములు లేక తాను స్వతంత్రంగా ప్రవర్తించినప్పుడు, ఈ ప్రవర్తననే మానవ జీవితములో ఒక విధమైనటువంటి పశు లక్షణము అని చెప్తూ వచ్చారు. ఇంక మనసుయొక్క తత్త్వము ఎట్టిదనగా దేహమును కాని లేక ఆత్మను కాని ఏమాత్రము సంబంధము కల్పించుకొనక తనయొక్క తత్త్వమును మాత్రమే తాను స్వయంగా, స్వేచ్ఛగా ప్రవర్తింప చేసుకునేటువంటి దానిని రాక్షసత్వము అన్నారు. దేహము, మనసులతో సంబంధము లేకుండా ఆత్మనే తన

sri sathyasaivacharamrutam

సత్ స్వరూపాన్ని ధరించి తాను ప్రవర్తించినటువంటి దానిని దైవత్వము అన్నారు. అయితే మానవుడు the proper study of mankind is man. ఈ మూడింటియొక్క స్వరూపమే మానవుడు. ఇట్టి పవిత్రమైన మానవత్వమును ఈనాడు మర్చిపోతున్నాము. మానవుడు అనగా మంచితనము కలవాడే మానవుడు. ఇట్టి మంచితనము కేవలము మన చదువులనుంచి ఆరంభమయ్యేటువంటిది కాదు. కాని ఈనాటి మానవుడు, ఆధునికమైనటువంటి మానవుడు విద్యావంతుడని విఱ్ఱవీగుతున్నాడు. ఏమిటి ఈ విద్య? చదివి, వ్రాయ నేర్చిన వారందరూ విద్యావంతులేనా? కాలేజీ డిగ్రీలు పొంద విద్యావంతుడగునా? సుజ్ఞానము నేర్పించలేని విద్యలు సద్విద్యలు అగునా? బ్రతుకుటకే విద్య అనిన, బ్రతుకుటలేదా పశుపక్షులు? కనుక మానవుడు చదివేటువంటిది బ్రతుకుకోసం కాదు. మానవతా విలువలు అభివృద్ధి పరచుకుని, ఈ మానవతా విలువలద్వారా మన మానవత్వాన్ని ప్రకటింప చేసుకోవాలి. Value for Truth, truth is education, education for life, life for man, man for society, society for science, science for spirituality, spirituality for nation, nation for world, world for Peace.

**శాంతిసంతోషములకు మానవతా విలువలే మూలాధారం**

ఈనాడు ప్రతి మానవుడుకూడను శాంతి, శాంతి, శాంతి కావాలని కోరుతున్నాడు. కాని ఈ శాంతి మానవతా విలువలనుండియే ఆవిర్భవిస్తున్నాది. విలువలే లేకుండిన మానవతావిలువలలో శాంతిని మనము పొందలేము. కనుకనే మన శాంతి సంతోషములకు మానవతా విలువలే మూలాధారములు. కనుక, దీని ఆధారమును గుర్తించుకొనలేక మానవుడు చదువుకుంటున్నాడు. కాని ఈనాటి విద్యలు దేహమునకు కాదు. కేవలము పరిజ్ఞానము కోసం కాదు. ఈనాటి మానవుడు పరిజ్ఞానమే విద్యయొక్క లక్ష్యమని భావిస్తున్నాడు. కాని ఈ పరిజ్ఞానము కాదు మానవత్వమునకు మూలకారణము. Information Oriented Knowledge. ఇది కేవలము మానవుని ఒక యంత్రస్వరూపునిగా మార్చగలుగుతున్నాది. మానవుని కేవలము ఒక కంప్యూటర్‌గా మారుస్తున్నాది. కాని కంపోజర్‌గా మార్చడం లేదు. మనకు కంప్యూటర్ కావడం గొప్పతనం కాదు, కంపోజర్ కావాలి. మానవ జీవితమును కేవలము ఆధారముగా తీసుకొని ఈ విద్యను అభ్యసించాలి.



sri sathyasai vahini amrutam

దేహమునే లక్ష్యముగా ఉంచుకోకూడదు. చదువు యొక్క లక్ష్యము దేహము కాదు. ఈ లక్ష్యముతో ఉండుటచేతనే మానవుడు కేవలము ఒకవిధమైన ధనము, స్వార్థము, స్వప్రయోజనము ఈ విధమైనటు వంటి దుర్లక్ష్యములను అభివృద్ధిపరుచుకుంటున్నాడు. కనుకనే స్వార్థము ఉండకూడదు. స్వార్థమునకు కూడను ఒక పరిమితి ఉండాలి. కనుక మానవత్వములో ఉండినటువంటి గుర్తులను ప్రతి విద్యార్థికూడను గుర్తించక తప్పదు. ఈనాటి ప్రభుత్వము ప్రతి పల్లెయందు, ప్రతి వాడయందు కూడను విద్యాసంస్థలు అభివృద్ధిపరచి విద్యకు గొప్ప ప్రోగ్రెస్సులో వచ్చింది అని భావిస్తున్నారు. విద్యయొక్క గుణములు ఏమిటి, సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్య పాలనములు నేర్పునదే విద్య, విద్యార్థి నేర్వవలెను. కాని ఏమిటి ఈ ప్రోగ్రెస్సు? మనము అనుకుంటున్నాము, విద్య పెరిగిపోతున్నదని. ఇది నిజమైనటువంటి ప్రోగ్రెస్సు కాదు.

**మేలుచేసిన వానికే కీడుచేయు**
**కూడు పెట్టిన దాతనే కూలదోయు**
**విద్య చెప్పిన గురువునే వెక్కిరించు**
**ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి విద్యయందు.**

కనుక ఇది కాదు మన ప్రోగ్రెస్సు. వినయ విధేయతలతో మానవత్వాన్ని పోషించి దివ్యత్వాన్ని రక్షించి దైవత్వాన్ని పొందటమే నిజమైనటువంటి విద్య. కాని ఈ విద్యయొక్క తత్వము ఈనాటి పిల్లలు ఏమాత్రము గుర్తించటానికి ప్రయత్నించడం లేదు. కనుక వాతావరణము అంతా కూడను మలినమైపోతున్నది.

**సత్యనిత్య సుకృతులెల్ల వికృతిరూపు పొందుచుండె**
**పవిత్ర ప్రకృతి ప్రతిదినము ప్రజల వీడిపోవుచుండె**
**ధర్మదయాచరణ సతతం వికృతిరూపు దాల్చుచుండె**
**వేదమాత ఘోషలన్ని విచారమును పొందుచుండె.**

ఇదియా విద్యా ప్రోగ్రెస్సు? కాదు కాదు. దయధర్మములతో కూడిన మానవత్వాన్ని మనము ప్రకటించాలి.

sri sathyasai vachanamrutam

సద్విద్య ఉన్నచో సంస్కారమదియబ్బు
సంస్కారమున్నచో జన్మమదియె
సద్విద్య ఉన్నచో సౌఖ్యంబు చేకూరు
సౌఖ్యంబు వల్లనే కల్గు శాంతి
సద్విద్య ఉన్నచో సత్సంగములు కల్గు
సత్సంగమున్నచో శాంతి అదియె
సద్విద్య ఉన్నచో జన్మ సార్థకమగు
జన్మ సార్థకముచే కలుగు ముక్తి
సత్యనిత్యమైన చదువు చదివినపుడె
సార రహితమౌ సంసార సాగరమున
మునిగి తేలక త్వరలోనె మోక్షమందు
కాన యిట్టి చదువునకై కదలిరండు.

విద్యార్థులారా! సత్యనిత్యమైనటువంటి చదువులు మనము చదవాలి. సత్యము సర్వత్రా నిండియే ఉన్నది. సత్యము ఒక కాల పరిమితికి చెందినటువంటిది కాదు. దేశకాల పరిస్థితుల ప్రభావములకు అతీతమైనటువంటిది సత్యము. ఒకరి నిమిత్తమై ఏర్పడినటువంటిది కాదు. సర్వ మానవులనిమిత్తమై ఏర్పడినటు వంటిది. సత్యము సర్వత్రా ఉంటున్నది. సత్యమే దైవము. ఇట్టి దైవత్వాన్ని వెతకడము ఎందుకోసం? సత్యాన్వేషణ సలుపుతున్నారు. ఏదో ఒక ప్రదేశములో ఉన్నటువంటిదానిని అన్వేషణ చేయాలి కాని సత్యమును అన్వేషణ ఎందుకు? కనుక ఈనాడు మనము చేసేదంతా సత్యాన్వేషణ కాదు. అసత్య నిర్మూలనకు మనము కంకణము కట్టాలి. సత్యము సాక్షాత్కరిస్తుంది. సత్యము తప్ప ఇంక జగత్తులో ఏమియూ లేదు. కనుకనే మనము సత్య స్వరూపులుగా రూపొందాలి. మానవుడు అనగా నిత్యజీవితములో ఏర్పడినటువంటి సమస్యలను పరిష్కరించుకుని దానికి పరిహారమునకు సంబంధించినటువంటి మార్గమును వెతుక్కుని నిత్యశాంతిని మనం పొందటానికి తగినటువంటి కృషి చేయాలి. శాంతి అనేటువంటిది కేవలము విలువల ద్వారానే మనకు ప్రారంభమౌతుంది. ఇటువంటి విలువలను ఈనాడు మనము దూరము

sri sathyasaivachanamrutam

గావించుకుని సత్యము, శాంతి, ప్రేమ కావాలి అంటే మనకు ఎలా లభ్యమవుతుంది? కనుక నిత్య జీవితములోపల సత్యమైన మార్గాన్ని అనుసరించి దివ్యత్వాన్ని పొంది మన విలువలను మనము పోషించుకుంటూ రావాలి.

**ప్రేమతత్వాన్ని విశ్వాసముతో పెంపొందించుకోవాలి**

ప్రేమస్వరూపులారా! విద్యార్థులు చాలా గుణము కలిగినటువంటివారు. కాని దానియందు తగినటువంటి విశ్వాసమును పోషించుకుంటూ రావాలి. నీ ప్రేమతత్త్వాన్ని అభివృద్ధి పరచుకోవాలంటే ప్రేమద్వారానే అభివృద్ధి పరచాలి. మొక్కను పెట్టినంత మాత్రమును పెద్దది కాదు. మొక్కకు నిత్యము నీరు పోస్తున్నప్పుడే అది పెరిగి పెద్దది అవుతుంది. కాని మనలో సహజముగా ఉండినటువంటి ప్రేమతత్త్వాన్ని విశ్వాసము అనేటువంటి జలముచేత పోషించి నిజమైనటువంటి శాంతి సత్యాన్ని పొందటానికి ఈ మానవతా విలువలే మూలాధారములు. ఏ మానవుడు నిత్యమూ తనయొక్క విలువలను ఆచరణలో ఉంచునో అట్టి మానవుడే ఆదర్శపురుషుడు. ప్రతి విద్యార్థి ప్రతి పల్లెలో కూడను ప్రవేశించి మానవతా విలువలును బోధించి వారిని సరియైనటువంటి మార్గమునకు తెప్పించడానికి కృషి చేయాలి. చదువు ఉద్యోగము కోసం అనేటువంటి తప్పుడు అభిప్రాయము మీ హృదయములో చేర్చుకోకూడదు. కనుక విద్య అనేటటువంటిది ఒక ఉద్యోగము నిమిత్తము ఏర్పడినటువంటిది కాదు. ఇది కేవలము ప్రజ్ఞాన నిమిత్తమై పవిత్రమైనటువంటి నిత్య సత్యమును బోధించే నిమిత్తమై ఈ విద్య మనకు ప్రాప్తిస్తున్నది. కనుక ఈ జ్ఞానము కూడను ఎలాంటి జ్ఞానము? మార్పు చెందనటువంటి జ్ఞానము. Constant Integrated Awareness. ఇట్టి జ్ఞానమును మనము పొందాలనుకున్నప్పుడు నిజమైన విలువలను మనము పొందాలి.

**భారతీయ సంస్కృతి పవిత్రమైనది**

ఈనాటి లోకములో భారతదేశము పవిత్రమైనటువంటి సమస్థితిని పొందినటువంటిది. అనాది కాలమునుండి అన్ని దేశములకునూ ఆదర్శవంతమైన రూపాన్ని ధరించినటువంటిది. భారతదేశముయొక్క తత్త్వమును ఎవరూ

sri sathyasaivacharamrutam

గుర్తించుకోవటానికి తగిన కృషి చేయడము లేదు. భారతదేశముయొక్క గాలిలో సత్యమున్నది. ధూళిలో ధర్మమున్నది. మట్టిలో ప్రేమ ఉన్నది. గంగలో దయ ఉన్నది. మనిషియందు క్షమ ఉన్నది. ఇలాంటి మానవతను పొందే నిమిత్తమై విదేశీయులు కొందరు భారతదేశము వచ్చి జీవించాలని అనేక రకములైనటు వంటి ప్రయత్నాలు చేశారు. ప్రాచీనకాలములో ఈ భారతీయులు త్యాగానికి కంకణం కట్టారు. ధర్మాన్ని వరించారు. సత్యానికి స్వాగతము పలికారు. కాని ఇట్టి పవిత్రమైన భారదేశమునందు మీరు జన్మించి మీ పవిత్రమైనటువంటి ప్రాచీన సంస్కృతిని కూడను విస్మరిస్తున్నారు అంటే, ఇది సరైనటువంటి ధర్మము కాదు. భారతదేశముయొక్క చరిత్రను మీరు చక్కగా పవిత్రమైనటువంటి భావముతో చదివినప్పుడు ఎక్కడైనా కూడను భారతీయులు ఏ రాజ్యముపైన దండెత్తి పోలేదు. ఇతరులు వచ్చి భారతదేశముపైన పడినప్పుడే వారు తిరిగి ఎదుర్కోవలసి వచ్చింది. భారతీయులు స్వార్థ త్యాగులు. స్వప్రయోజనము అనే దానికి వారు ఏమాత్రము ప్రయత్నించటము లేదు. ఎవరైనా భారతదేశముపైన దండెత్తివచ్చినప్పుడే భారతీయులు ఎదుర్కోవడము వారికి సహజము. ఏ దేశముయొక్క సొత్తును ఆశించేటివారు కాదు భారతీయులు. ఈ చరిత్రయందు మీరు చక్కగా విచారణ చేస్తే, సర్వమునూ త్యాగము చేసినటువంటి మూర్తులే భారత మూర్తులు అని తెలుస్తుంది. భారతదేశముయొక్క చరిత్రను పవిత్రమైన భావముతో విమర్శించినప్పుడే భారతీయులయొక్క చరిత్ర సార్థకమవుతుంది.

**నిరత సత్యప్రౌఢి ధరణినేలిన హరి**
**శ్చంద్రుడీ ధరబాసి చనగలేదె?**

హరిశ్చంద్రుడు కడపటి వరకు సత్యమే, సత్యమే, సత్యమే అని దానిని పట్టుకుని అనేక విధములుగా సర్వస్వమును కూడను తాను త్యాగము చేసి సత్యాన్ని సాధించాడు. ఒక పక్షిని రక్షించే నిమిత్తమై శిబి చక్రవర్తి తన కండరములను కూడా కోసి త్యాగము చేశాడు. తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె, ధృతి చంద్రమతి భారతీయ కాదె? ఇలాంటి మహాత్యాగులు స్త్రీలు, పురుషులు కూడను ఉద్భవించినటువంటి పవిత్రమైన త్యాగభూమి ఈ భరతభూమి. ఇట్టి త్యాగభూమిని, యోగభూమిని, కర్మభూమిని ఈనాడు భోగభూమిగా మార్చుకోవడానికి ఈనాటి విద్యార్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ భోగములో మనకు ఆనందము లేదు. రెండు కష్టముల

sri sathyasai vachanamrutam

మధ్యలోపలనే సుఖము కూడను మనకు ప్రాప్తిస్తుంది. ఈ బాధలే లేకపోతే ఈ సుఖానికి మనము విలవనే ఇవ్వము. కనుకనే 'తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చే', సత్యముయొక్క ప్రతిజ్ఞ చేతనే దావాగ్నిని చల్లారుతుంది. ఇలాంటి మహాపతివ్రతలైనటువంటి స్త్రీలు, ధీరులు, వీరులు, అయినటువంటి గంభీరులు ఈ భారతదేశమునందు ఉద్భవించి అనాది కాలమునుండి కూడా భారతదేశముయొక్క కీర్తిని చిరస్థాయిగా నిలబెడుతూ వచ్చారు. ఇలాంటి భారతభూమియందు ఉద్భవించినటువంటి విద్యార్థులు మీరు. ఏ పదార్థమునుండి ఉద్భవించిందో ఆ వస్తువు కూడా ఆ పదార్థముయొక్క స్వరూపాన్ని పొందుతుంది. మట్టినుంచి పుట్టింది కుండ. కుండంతా మట్టియే మట్టినుంచి పుట్టినటువంటి కుండ మట్టి కాకపోతుందా? బంగారంనుండి పుట్టినటువంటి నగ బంగారుగానే ఉంటుంది. అదే విధముగనే బ్రహ్మనుండి ఆవిర్భవించినటువంటిదే ఈ ప్రకృతి. కాబట్టి ప్రకృతి అంతయూ కూడను బ్రహ్మమయమే. ఈ బ్రహ్మమయమునుండి పుట్టినటువంటి వారే మానవులు. కనుకనే మానవులు అందరూ కూడను దైవస్వరూపులే. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' శరీరమును ధర్మకర్మములో మనము ప్రవేశపెట్టాలి. ఈ కర్మ ఏ విధముగా ఉండాలి? ధర్మానుకూలముగా ఉండాలి. ఈ ధర్మమును ప్రవర్తింపచేసే నిమిత్తమై ఆదర్శాన్ని మనము నిరూపించాలి. కాని ఈనాటి ధర్మము ఏమిటో వారికి అర్థము కావటము లేదు. మానవత ఏమిటో వారు తెలుసుకోవటానికి వారు ప్రయత్నించటంలేదు. మానవతా విలువలను ఏ రీతిగా దానిని గుర్తించటానికి వీలవుతుంది? కనుక మొట్టమొదట సృష్టిని మనము గుర్తించినప్పుడే సృష్టికర్తయొక్క తత్త్వాన్ని, మనము గుర్తించిన వారమవుతాము. ఇదంతయూ కూడను దైవమయమే. ప్రతి ఒక్కరూ దైవస్వరూపమే. రూపనామములు ప్రత్యేగముగా గోచరించినప్పటికిని అందులో ఉన్నటువంటి మూలాధారమైన శక్తి ఒక్కటిగానే ఉంటుంది.

### అంతా బ్రహ్మమే-ఏకత్వాన్ని గుర్తించాలి

ఇది వస్త్రము అంటాము. కాని ఇది మనకు వస్త్రము రూపముగా కనిపిస్తూ ఉన్నాది. కాని ఇది వస్త్రము కాదు, దారములయొక్క చేరిక. ఇవి దారములు కాదు, ప్రత్తియొక్క ప్రభావమే. కనుక ప్రత్తి, దారము, వస్త్రము మూడు ఒక్కటే. కనుక దైవము, సృష్టి, సృష్టియొక్క మానవత్వము మూడు కూడను ఒక్కటే. కనుకనే 'ఈశ్వరః సర్వ భూతానాం'

అన్ని భూతములందు ఉన్నటువంటిది దైవమే. 'సర్వం ఖల్విదం బ్రహ్మ'. దీనికంటే రెండవ పదార్థము మరొకటి లేదు. ఉన్నది ఒక్కటే. నిన్న ఒక అమెరికన్ పిల్లవాడు వచ్చాడు. నేను అడిగాను నీకు ఎంత వయస్సు? అన్నాను. 7 సంవత్సరములు అన్నాడు. నీకు ఎట్లా తెలుసు అన్నాను. నా అమ్మా నాన్న చెప్పారు అన్నాడు. కాదు కాదు ఒక్కటే ఈ ఒక్కటి 7 గా మారిపోయింది అన్నాను. ఏడు ఒకట్లు చేరినప్పుడే ఏడు గా మారిపోయింది. ఒకటే లేకపోతే ఏడు కాలేదు. కాబట్టి ప్రపంచమంతా మిలియన్లంతా కూడను ఒక్క ఏకత్వములోనే ఇమిడి ఉంటున్నది. దీనినే వేదాంతము 'ఏకంసత్ విప్రా బహుధా వదంతి' అన్నారు. ఉన్నది అంతా ఒక్కటే. దీనికంటే రెండవ పదార్థము మరొకటి లేదు. వేరు వేరు రూపనామములతో మనము గోచరమవుతున్నాము కాని, వేరు రూపనామములంతా కూడను స్థిరమైనటువంటివి కాదు. అన్నింటియందు కూడను ఏకత్వముగా ఉండినవి దైవత్వము ఒక్కటే. కాని దానిని నమ్మలేకపోతున్నారు, మానవులు. కనుకనే తనను తాను నమ్మలేనటువంటి వాడికి ఆనందము ఎక్కడ లభిస్తుంది. మొట్టమొదట తనను తాను నమ్మాలి. అదియే గొప్ప వివేకము. ఆత్మవిశ్వాసము చాలా ఉండాలి. అది లేకపోతే దేనిని నమ్మలేరు. తనను తానే నమ్మలేడు. ఇంక ఇతరులను ఏవిధముగా నమ్మగలడు? కనుకనే, మొట్టమొదట తనలో ఆత్మవిశ్వాసము కలగాలి. ఈ ఆత్మవిశ్వాసము లేనటువంటి వారికి అనేక రకములైన ఇక్కట్లు కలుగుతూ ఉంటాయి. ఈ ఇక్కట్లకు మూలకారణము ఆత్మవిశ్వాసము లేకపోవటమే. ఎలాంటి పరిస్థితులయందు కూడా ఆత్మవిశ్వాసమును గట్టిగా నమ్ముకోవాలి. ప్రాచీనకాలమునుండి భారతీయులు ఆత్మవిశ్వాసము చేతనే కాలమును నెట్టుకుంటూ వస్తున్నారు. ఈ ఆత్మవిశ్వాసము లేకపోతే భారతీయులు క్షణమైనా బ్రతికేటటువంటి వారు కాదు. కనుక మనము విశ్వాసమును పెంచుకోవాలి. విశ్వాసమును శ్వాసగా భావించుకోవాలి. మన విద్యలన్నిటినీ సత్యమైనటువంటి విద్యలుగా రూపొందింప చేయాలి. చదివిన చదువులు ఆచరణలో పెట్టాలి. ఆచరణలో పెట్టనటువంటిది బుకిష్ నాలెడ్జి అది కేవలము సూపర్‌ఫిషియల్ నాలెడ్జి. దానివలన మనకు ఏమాత్రము తగినటువంటి ఫలితము దక్కదు. ప్రాక్టికల్ నాలెడ్జిలో మనము ప్రవేశించాలి.

**ప్రతి వ్యక్తికీ దేశభక్తి కూడా ఉండాలి**



srisathyasaivachanamrutam

విద్యార్థులారా! మీరు చాలా మంచివారే. ఇలాంటి మంచి పిల్లలే ఇక్కడ ప్రవేశించారు. ఆత్మవిశ్వాసము మీయందు ఇమిడియున్నది. కాని దేశముయొక్క విశ్వాసమును కూడా మనము పెంచుకోవాలి. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అని రాముడు చెప్పాడు. కనుక ఇట్టి దేశముపై విశ్వాసము లేకపోతే మనము ఏమాత్రము ఉండి ప్రయోజనము లేదు. నీ విశ్వాసము నీకు ఎంత ప్రధానమో ఈ దేశముయొక్క విశ్వాసము కూడా అంతే ప్రధానముగా ఉండాలి. దేశము దేహముపైన ఆధారపడి యుంటున్నది. దేహము అనేటువంటిది దేశముపైన ఆధారపడియుంటున్నది. దేహము, దేశము బింబప్రతిబింబములే. దేశాన్ని వదలి దేహము ఉండలేదు. కనుకనే దేశముయొక్క పవిత్రతను కూడా మనము దృష్టియందు ఉంచుకోవాలి. ఏది చేసినప్పటికిని దేశముయొక్క మంచికోసము మనము ప్రయత్నించాలి. మొట్టమొదట మానవుడు వ్యక్తిగతమైనటువంటి గుణములు పెంచుకోవాలి. రెండవది సంఘముయొక్క మంచిని మనము పెంచుకోవాలి. మూడవది విశ్వముయొక్క తత్త్వాన్ని గుర్తించాలి. కనుకనే ఈ మూడింటియొక్క పరిణామమును పొందే నిమిత్తమై మానవుడు పుట్టాడు అనే సత్యాన్ని గుర్తించాలి. అందుకోసమే ఈ మూడింటిని చక్కగా చెప్తుంటాను. SAI. S అనగా Spiritual Norm. A అనగా Associational Transformation. I అనేది Individual యొక్క పరిణామము. ఈ Spiritual ప్రధానముగా ఉండినప్పుడే Association ప్రధానముగా ఉంటుంది. అది చక్కగా ఉండినప్పుడే Individual అనేటు వంటిదికూడను ప్రమాదరహితముగా ప్రవర్తిస్తాడు. మొట్టమొదట శక్తిని మనము పోషించుకోవాలి. ఈ వ్యక్తిత్వాన్ని సార్థకము గావించుకోవాలంటే క్రమశిక్షణతో జీవితములో మనము మెలగాలి. కనుక వ్యక్తిత్వము నుంచే దివ్యత్వము ఆవిర్భవిస్తూ ఉంటుంది. కనుక ఒక్కడే ఒక్కడే అనేటువంటిభావము పెట్టుకోకూడదు. నేను సంఘములో ఒక సభ్యుడను. సంఘము లేకపోతే నా సభ్యత్వము ఎందుకు పనికొస్తుంది. కనుక సంఘమును కూడా దృష్టిలో పెట్టుకోవాలి. అది లేనప్పుడే మనము అన్ని విధములైన చిక్కులకు గురి అవుతున్నాము.

**విద్యావంతులు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి**

విద్యార్థులారా! మీతోపాటు మీ సమాజమును, మీ సంఘమును, మీ గ్రామమును, మీ

పట్టణమును, మీ ప్రాంతమును తగినటువంటి రీతిగా అభివృద్ధి పరచడానికి తగిన కృషి చేయాలి. కనుక మీరు చదివారు, గొప్ప డిగ్రీలు పొందినారు అంతమాత్రములోనే మీ చదువును పూర్తి చేసుకోకూడదు. దానిని తోటి మానవులకు అందించడానికి తగినటువంటి కృషి చేయాలి. ప్రాచీన కాలమునుండి భారతీయులు అనేక దేశములకు కూడను సుప్రసిద్ధమైన శాంతిభద్రతలను చేకూరుస్తూ వచ్చారు. కనుకనే నాటినుండి నేటివరకు 'లోకాః సమస్తాః సుఖినో భవంతు' అనేటువంటిదే భారతీయులయొక్క ధ్యేయము. అందరూ క్షేమంగా ఉండాలి. ఏ వ్యక్తిపైన కూడను మీరు ద్వేషాన్ని పూనకూడదు. అందరియందు ఉన్నది ప్రేమ ఒక్కటే. దయగల హృదయమే దైవమందిరము అన్నారు. కనుకనే దీని పేరే హృదయం. కనుక నీయొక్క దయ అనేటువంటిదే compassion. నీయందు ఆ compassion పెట్టుకొని ఆ దయను ఉంచుకొని ఇతరులకు ద్వేషాన్ని ఎందుకు పంచుతున్నావు. ఈ ద్వేషము అసూయ ఇవన్నీ రాక్షస గుణములు. ఇంక దయ కలిగినట్టి హృదయమే మానవత్వము. ప్రతి ఒక్కడును దయామయుడుగా ఉండాలి. ప్రతి మానవుని దయామయ స్వరూపునిగా మార్చాలి. అదే సరైనటువంటి విద్య. అలాంటి విద్య లేకుండా చదువులు చదివేది మానవత్వం కాదు. ద్వేషాన్ని అసూయను మనము పంచుకుంటుంటే ఇది చదువుకు సంబంధించినది కాదు. మనకు లోపల ఏమిటి ఉందో దానినే ఇతరులకు పంచుతున్నాము. నీయందు నిజముగా ప్రేమ దయనే ఉంటుంటే, నీవు దయ ప్రేమనే పంచుతావు. మనసును మంచి రీతిలో మార్చుకోవాలి. మంచి మనసుగా ఉండినప్పుడు మంచి పనులే, మంచి చూపులే, మంచి శ్రవణమే, మంచి వాక్కులే, మంచితనమే నీవు చూపిస్తుంటావు. మనసనేటువంటిది కేవలము నీళ్ళ ట్యాంకువంటిది. ఈ శ్రవణము, వాక్కు, చేతలు ఇవన్నీ కూడను ట్యాప్స్‌వంటివి. నిజముగా ఈ ట్యాంకులో పవిత్రమైన జలమునే నింపితే అంటే ఈ ట్యాప్స్‌లో అంతా పవిత్రమైనటువంటివే వస్తుంటాయి. కనుకనే నీ చూపులను మంచి చూపులుగా పెట్టుకో.

**See no evil, see what is good,**
**Talk no evil, talk what is good**
**Hear no evil, hear what is good**
**Think no evil, think what is good**

sri sathyasai vahini amrutam

**Do no evil, do what is good**
**This is the way to GOD.**

ఇదే నిజమైన హృదయానికి లక్షణము. ఈ లక్షణములే లేకపోతే హృదయమే కాదు కట్ట వంటిది, బండ వంటిది, రాయి వంటిది. ఈ దయ ఉండటము చేతనే మానవునికి, హృదయము అని పేరు పెట్టారు. కనుకనే మానవులను కూడను mankind అని పిలుస్తుంటారు. Kindness లేకపోతే man ఎట్లా అవుతాడు. కనుకనే హృదయములో ఈ kindness అనేది పెంచుకోవాలి. విరోధి అనే వాడే మనకు ఉండకూడదు. కాని కొన్ని సందర్భములలోపల వారి పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకుని కొంత ద్వేషము చేయవలసి వస్తుంది. అది తాత్కాలికమైనటువంటిదే కాని శాశ్వతమైనది కాదు. వారిని మార్చే నిమిత్తమై మనము కొంచెము చూపించవలసిన లక్షణములు. కాని ద్వేషమును మనకు సాధ్యమైనంత వరకు కంట్రోలు చేస్తూ రావాలి. కేవలము ఈ బుకిష్ నాలెడ్జి వలన మీరు గొప్ప విద్యావంతులని భావించుకోవటం ఇది వెఱ్ఱితనము.

**విద్య జీతం కోసం కాదు - జీవితం కోసం**

విద్యార్థులారా! మీరు ప్రప్రథమముగా గుర్తించవలసినది, విద్య ఉద్యోగాలకోసమనేటివంటి చెడ్డభావాన్ని మీ హృదయమునుంచి తొలగించు కోవాలి. ఏమిటి ఈ ఉద్యోగాలు? ఇది కుటుంబ పోషణకు అవసరమే. కాని ఈ కుటుంబపోషణకు ఏర్పడినటువంటిది కాదు విద్య. ఏ విద్యలూ లేనటువంటి వాడు కుటుంబాన్ని పోషించటము లేదా? ఎన్ని రకములైనటువంటి మంచి తనముతో జీవితము గడపవచ్చును. పనులు చేయవచ్చును. ఉద్యోగాలు చేయవచ్చును. కాని ఉద్యోగ నిమిత్తమై ఈ చదువు ఏర్పడినది అనే భావము మాత్రము మీనుండి దూరము కావాలి. అందువలననే నేను చెప్పాను.

**చదివి వ్రాయ నేర్చినవారందరు విద్యావంతులేనా?**
**కాలేజి డిగ్రీని పొంద విద్యావంతుడగునా?**
**సుజ్ఞానము సుకృతములు లేని విద్యలు విద్యలగునా?**
**బ్రతుకుటకై విద్యయన్న పశు పక్షులు బ్రతుకలేదె!**

sri sathyasai vachanamrutam

ప్రాచీనవు మన భారతీయ సంస్కృతి ఏమైపోయింది? కనుకనే భారతీయ సంస్కృతియొక్క నిజ తత్త్వము చక్కగా విచారిస్తూ రావాలి.

**నీతినియమాలు గ్రంథాన నిలచిపోయె**
**హృదయమంతయు దుర్గంధ సదనమయ్యె**
**చేతలంతయు స్వార్థంపు చేతలయ్యె**
**ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి విద్యలందు.**

కాదు కాదు, హృదయము మాలిన్యముతో ఉండకూడదు. చేతులు త్యాగముతో ఉండాలి. చేతులు చాలా పవిత్రమైనటువంటివి. ఈ కంఠమునకు ఏది ముఖ్యము? సత్యం కంఠస్య భూషణం, దానం హస్తస్య భూషణం, శ్రవణం శ్రోతస్య భూషణం. ఇలాంటి భూషణాలు, ఎందుకోసం మనము అందుకున్నాము? ఈ చేతులు ఉన్నాయి, ఇతరులను కొట్టటం కోసమని, ఇతరులను దండించడం కోసమని, హాని చేయడం కోసమని దీనికోసం ఉపయోగిస్తున్నాము. కాదు కాదు, హస్తస్య భూషణం దానం. ఆ దానము అనేటువంటి దానిని మనం చక్కగా చేయాలి. ఈ దానము చేతనేమానవుడు దయామయుడైన మానవుడుగా రూపొందుతున్నాడు. నీకున్నటువంటి దానిలో అర్ధభాగము నీవు ఇచ్చేసెయ్యి. నీవు బిక్షగాడు కానక్కరలేదు. కాని ఈ త్యాగము మానవునిలో లేకపోతే ఏమొస్తుంది ఇంక? త్యాగము చేయటమే నిజమైన భోగము. త్యాగము చేయకుండా ఉండటమే నిజమైన రోగము. కనుక మనము రోగాలకు బలికాకూడదు. యోగానికి బలికావాలి. త్యాగానికి బలి కావాలి. అప్పుడు మానవత్వము అనేటువంటి దానిని చక్కగా మనము పోషించుకున్నవారము అవుతాము. మానవులు చాలా గొప్ప విలువైనటువంటి వారు. మానవునికి ఉన్న విలువ మరొకరికి లేదు. డైమండుకు విలువ అనుకుంటాము. కాదు, కాదు. బంగారుకి విలువ అనుకుంటున్నాము. కాదు, కాదు. స్థలానికి విలువ అనుకుంటున్నాము. కాదు, కాదు. మనిషికి ఉన్నటువంటి విలువ దేనికీ లేదు లోకములో. డైమండుకి విలువ ఇచ్చేది ఎవరు? మనిషే. బంగారంకి విలువ ఇచ్చేది ఎవరు? మనిషి. స్థలానికి విలువ పెంచేది ఎవరు? మనిషే. అంత విలువైన మంచి మనిషిని ఈనాడు చాలావరకు పోగొట్టుకుంటున్నాము. ఈనాడు మానవతా విలువలు దిగజారిపోయాయి.

srisathyasaivachanamrutam

మానవుడుగా ఉన్నాడు కాని మానవతా విలువలు పోయినాయి. మానవతా విలువలే మనము మరణించిన తరువాత కూడను శాశ్వతంగా ఉంటాయి. మనిషి మరణించవచ్చును. కాని విలువలు చిరంజీవిగా నిలుస్తూ ఉంటాయి. కనుక ఇట్లాంటి మానవత్వాన్ని మనము తుచ్ఛంగా భావించుకోవటం చాలా పొరపాటు. చిల్లర మార్గములలో ప్రవేశించి పరులను దూషించటము, పరులను హింసించటము, పరులను బాధించటము ఇలాంటి విషయాలలో మనము ప్రవేశించకూడదు. ఒకవేళ వారిలో దోషము ఉండినప్పటికిని వారికి నచ్చ చెప్పి వారిని సరియైనటువంటి మార్గములో ప్రవేశపెట్టవచ్చును కాని, వారిని నిష్కారణముగా దూషించి, బాధింపచేయటం మంచిది కాదు. ఈనాటి రాజకీయములంతా ఈ రకమైనటువంటి మార్గములో ప్రవేశిస్తున్నాయి. మొట్టమొదట విజ్ఞానమునకు వివేకము కావాలి. వివేకము లేని విజ్ఞానము, విచక్షణ లేని పాండిత్యము, మాధుర్యములేని సంగీతము, త్యాగము లేని భావము, క్రమశిక్షణ లేని సమాజము, నీతి లేనటువంటి రాజకీయము నిరుపయోగముగా ఉంటాయి. కనుకనే మనము మొట్టమొదట వివేకముతో ప్రారంభము కావాలి. పుట్టిన తేదీలు, లక్షణాలు మనము చూస్తున్నాము. అది కాదు. చావు అనేటువంటి లక్షణము చాలా మంచిది. పూర్వ జన్మమునకు పునాది అదే. పుట్టుక తేదీలు, దాని మంగళ సూత్రములు, దాని మంగళ కార్యములు మనము భావిస్తూ ఉంటాము. ప్రాణము వదిలే సమయములో మంచి పేరును తెచ్చుకోవాలి. దైవప్రేమకు అర్హతపొందాలి. దైవప్రేమను మనము పెంచుకోవాలి. దైవప్రేమయే లేకపోతే జీవితము నిరుపయోగమైనది. ప్రేమ లేనటువంటి మానవత్వము దీపాలు లేనటువంటి ఇల్లు వంటిది. చెల్లని కాసువంటిది. కనుక మనము భగవంతునియొక్క కృపకు పాత్రులు కావాలి. ఇది ఎక్కడనుంచి వస్తుంది? అది కూడా నీ హృదయమునుంచే రావాలి. భగవంతుడు నీ హృదయవాసి. అనేక పర్యాయములు చెప్పాను నేను, విద్యార్థులకు. మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అని తల్లితండ్రులను సేవించండి, గౌరవించండి, గురువులను సేవించండి, గౌరవించండి. వారు దైవస్వరూపులుగా మీరు భావించండి. కాని, ఇవన్నీ కూడను కొన్ని మార్పులు చెందేటువంటివే. తల్లి ఎక్కడ నివసిస్తున్నాది? తన గృహములో నివసిస్తున్నాది. తండ్రి

sri sathyasai vahini vachanamrutam

ఎక్కడ నివసిస్తున్నాడు? తన గృహములో నివసిస్తున్నాడు. గురువు ఎక్కడ నివసిస్తున్నాడు? ఆశ్రమములో నివసిస్తున్నాడు. కాని కొంత కాలమునకు గృహములు మారవచ్చును. ఆశ్రమములు మారవచ్చును. కాని భగవంతుడు ఎక్కడ నివసిస్తున్నాడు? హృదయములో ఉంటున్నాడు. ఈ హృదయాన్ని మార్చుడానికి వీలులేదు. అది శాశ్వతనిలయం. కనుక ఆ హృదయవాసిని మనము పొందాలి. అతను శాశ్వతంగా ఉంటున్నాడు. 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం'. పుట్టిన పిల్లవాడు బిడ్డగా ఉంటాడు. పది సంవత్సరములకు బాలుడుగా మారతాడు. 30 సంవత్సరములకు యువకుడుగా తయారౌతాడు. 75 సంవత్సరములకు వృద్ధుడుగా మారిపోతాడు. ఇవన్నీ మార్పు చెందేటటువంటి దేహాలు. తల్లి దేహము మార్పు చెందుతుంది. తండ్రి దేహము మారుతుంది. కాని దైవము ఎప్పటికి మార్పు చెందడు. అతను ఎప్పుడూ శాశ్వతంగా ఉంటాడు. ఇంక మనస్సు పిచ్చికోతి వంటిది. ఒక్క క్షణములోపల కొన్ని వేల సంకల్పములు చేస్తున్నాది. ఇలాంటి మారేటువంటి మనసును ఎందుకు నమ్ముతావు? కనుక ఈ మనసును నీవు స్వాధీనము చేసుకోవాలి. దీనినే పతంజలి యోగ సూత్రముల లోపల మనసుయొక్క ఆధీనమే మానవత్వమన్నారు. ఈ ఇంద్రియాలను నిగ్రహించుకునేటటువంటి శక్తిని మనము సంపాదించాలి. ఈ ఇంద్రియాలను నిగ్రహించినటువంటి నాడు నీవే దైవము అయిపోతావు. దైవము ఎక్కడో నీవు వెతకనక్కరలేదు.

**దేవుడనగ వేరు దేశమందున లేదు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తానుచేయు పనుల తగిలియుండు**

ఈ పాపమనేటటువంటిది మనము చేసే పనులతోనే వస్తున్నాది. దైవము మన హృదయమునందే ఉన్నాడు. నీవు ఎక్కడా వెతకనక్కరలేదు. కాబట్టి అందరూ దైవస్వరూపులే. You are the embodiment of Love. You are the embodiment of Peace. You are the embodiment of Truth. You are the embodiment of GOD.

sri sathyasai vahini

కనుక మీరే దైవస్వరూపులుగా ఉండాలి. ఈ సత్యాన్ని మీరు గుర్తించి మీ తత్త్వాన్ని చక్కగా అర్థము చేసుకున్నప్పుడు మీరు ఎంతో ధన్యులవుతారు. అప్పుడే మీరందరు ఆదర్శప్రాయులుగా రూపొందుతారు. కనుక మానవుడుగా పుట్టినందుకు ఆదర్శవంతుడుగా తయారుకావాలి. ఈ ఆదర్శము చూపే నిమిత్తమై మానవుడుగా వచ్చాడు. అయితే ఈ మానవుడు ఎందుకోసం తన తత్త్వాన్ని తాను మర్చిపోతున్నాడు? ఈ ప్రకృతి వాంఛలను పెంచుకుంటున్నాడు. ఇవి పెరిగిపోవటం చేతనే తన తత్త్వాన్ని తాను మర్చిపోతున్నాడు. ఈ ప్రకృతి వాంఛలను క్రమక్రమేణా తగ్గించుకోవాలి. నీ దివ్యమైనటువంటి భావము నీకు మిగులుతుంది. కనుకనే, మానవత్వములోపల Less luggage, more comfort, make travel a pleasure. ఈ లగేజీ ఏమిటి? ఈ కోరికలే మనకు లగేజీ. ఎంతవరకో అంతవరకే పెట్టుకోవాలి. మితిమీరినటువంటి కోరికలు పెట్టుకోకూడదు. తద్వారా మనకే ప్రమాదము వస్తుంది.

**ఇక్కడి వైస్ ఛాన్స్లర్లు అంతా మేధావులు, సేవాపరాయణులు**

కాబట్టి విద్యార్థులారా! ఈనాడు మనము పాత వైస్ చాన్సలర్, వెంకట్రామన్‌ను వదలిపెట్టి క్రొత్త వైస్ చాన్స్లర్ ఎస్.వి.గిరిగారిని మనము తీసుకున్నాము. మనము ఎవ్వరికీ స్వాగతము చెప్పటము లేదు. ఎవ్వరికి పంపించేటప్పుడు అభినందనములు చెప్పటం లేదు. వీడ్కోలు చెప్పటం లేదు. స్వాగతము చెప్పితే కదా వీడ్కోలు చెప్పేది. కాబట్టి అతనికి స్వాగతము కాదు. ఇతనికి వీడ్కోలు కాదు. ఇరువురూ మనవారే. ఇప్పుడే వెంకట్రామన్ చెప్పాడు. ఏ సేవ ఇచ్చినా నేను చేస్తాను అని. అందుకోసమే అతనిని కూడ మేము పంపటము లేదు. అతనిని కూడ ఇక్కడే ఉంచుకుని, ఇక్కడ కొన్ని రీసెర్చ్ స్కాలర్ క్రింద కొన్ని ప్రయత్నాలు చేస్తూ, ఈ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ దానిపై కొంచెము ప్రయత్నము చేయాలి అని చూస్తున్నాము. ఇక్కడ పెద్ద ఆసుపత్రి ఉంది. ఈ ఆసుపత్రిలో లైటు చాలా తక్కువగా ఉన్నాది. కొన్ని ఆపరేషన్ టైములో చాలా ప్రకాశవంతమైన లైటుగా ఉంటే ఎంతైనా కూడను సహాయముగా ఉంటాది. ప్రకృతి లైటు కాకుండా, కొన్ని విజ్ఞానపరంగా తయారుచేసి ఆ లైటును అభివృద్ధి చెయ్యటానికి మన వెంకట్రామన్‌ను నియమిస్తున్నాము. కనుక పేరులు మారుతున్నాయే కాని మనుషులు పోవటము లేదు. మొట్టమొదట గోకాక్

sri sathyasai vahini.org

ఇక్కడ ప్రవేశించాడు. అతను గొప్ప పండితుడు. మహాజ్ఞాని, మహా సాధకుడు, చాలా గొప్ప యోగివంటివాడు. అలాంటివాడు ఇక్కడకు వచ్చి ఉచితంగా సేవ చేశాడు. ఏ ఒక్క నయాపైస కూడా తాను ముట్టలేదు. ప్రతి ఒక్క దానికి కూడను రాత్రింబవళ్ళు కూడను తన ఇల్లువలే ఈ సంస్థను చూచుకున్నాడు, మన సంస్థను. అతను పోయిన తరువాత గవర్న్‌మెంటు కొన్ని నిబంధనలు పెట్టినవి. రిటైరు అయిన తరువాత రెండు సంవత్సరములు కంటే ఎక్కువ ఉండటానికి వీలులేదు. మరి గవర్న్‌మెంటు రూలును మనము అంగీకరించక తప్పదు. కనుక దానిని ధిక్కరించడానికి వీలులేదు. అది అయిన తరువాత షరాఫ్ వచ్చాడు. అతనూ చాలా గొప్పవాడే. అతను యూజీసీలో ఒక మెంబరు. అతను కూడ ఇక్కడకు వచ్చి తాను మూడు సంవత్సరములు పని చేశాడు. అతను వెళ్ళిన తరువాత హనుమంతప్ప వచ్చాడు. ఈ హనుమంతప్ప పోయిన తరువాత మన సంపత్ వచ్చాడు. అతను చాలా గొప్పవాడు. కాన్‌పూర్ యూనివర్సిటీలో చాలా గొప్ప పేరు సాధించినవాడు. ఆయన కంప్యూటర్‌లో చాలా ప్రసిద్ధి పొందినటువంటివాడు. అతను కూడా ఇక్కడకు వచ్చి చాలా శ్రద్ధగా పని చేశాడు. ఈ వచ్చినటువంటి వారు ఎవ్వరూ కూడా ఒక్క నయాపైస ఆశించలేదు. నేను ఇచ్చినా పుచ్చుకోవటము లేదు. మీ దయ తప్ప మాకు ఏమీ అక్కరలేదు అన్నారు. తరువాత వెంకట్రామన్ వచ్చాడు. ఈ వెంకట్రామన్ కూడను ఎంతో శ్రద్ధాభక్తితో రాత్రింబవళ్ళు పని చేశాడు. ఆయన సర్ సి.వి.రామన్‌యొక్క శిష్యుడు. అతను కాంతిరేఖలను అంతా చక్కగా తాను పరిశీలన చేశాడు. దానితోనే అతనికి పద్మశ్రీ అనే బిరుదు వచ్చింది. ఈ మనుషులు చూడటానికి సాధారణంగా కనిపిస్తారు. ఈ ప్రశాంతి నిలయములో అందరు సాధారణముగా కనిపిస్తారు. కాని వారి అసలు ప్రతిభ చాలా లోతుగా ఉంటుంది. మన ప్రశాంతి నిలయములో వెంకట్రామన్ కూడా చాలా సాధారణంగా జీవిస్తూ వచ్చాడు. అతనికి పని అయినప్పటికినీ నేను పోను నేను ఇక్కడే ఉంటాను అన్నాడు. నేను పంపటము లేదు. ఆయనకూడా ఇక్కడే ఉంటాడు. ఎస్.వి.గిరి వచ్చాడు. ఆయన చాలా పెద్ద పనిలో ఉంటున్నాడు. యధార్థము చెప్పాలంటే ఈనాడు చెపుతున్నాను ఆయన పని వద్దాన్నాడు. ఆతను Central Vigilance Commission, Chairman. Prime Minister కూడా ఇప్పుడు పోకూడదు అన్నాడు. తన తోటివారంతా

sri sathyasai vachanamrutam

ఆయన ఇక్కడనుంచి పోవడానికి వీలులేదు అన్నారు. ఆయనకింకా సేవ చేయడానికి 5 సంవత్సరములు ఉన్నది. అతను రాస్తే గవర్నమెంటుకు ప్రైమ్‌మినిష్టర్ సంతకం చేయలేదు. ఎస్.వి.గిరి గట్టిగా పట్టుపట్టాడు. సర్, నేను పుట్టపర్తి పోయి ఉండటానికి నిర్ణయము చేసుకున్నాను మీరు ఏమైన చేసుకోండి నేను ఇక్కడ ఉండను అన్నాడు. వాజపేయి కూడను స్వామి భక్తుడు కనుక, ఆయన చెప్పాడు. ఇంకొక చోటుకు పోతే నేను అడ్డము చెప్పేవాడిని కాని ప్రశాంతి నిలయము పోతున్నావు కాబట్టి నేను అంగీకరించక తప్పదు అన్నాడు. రెండవ దినమే సంతకం చేశాడు. మూడవ దినమే బయలుదేరి వచ్చాడు. నేను ఇక్కడ ఉండను అన్నాడు గట్టిగా. ఈ విధమైనటువంటి ప్రేమ చేతనే మీపైన ఉన్నటువంటి విశ్వాసము చేతనే ఇటువంటి వైస్ చాన్స్‌లర్స్ అందరూ మీకు దక్కుతున్నారు.

విద్యార్థులారా! ఎవ్వరికీ దొరకని ఈ పవిత్ర హృదయులైన వైస్ చాన్స్‌లర్స్ మీకు లభ్యమౌతున్నారు. తెల్లవారి మొదలు రాత్రి వరకూ పిల్లలతోనే పనులు చేస్తుంటారు . ఏ వైస్ చాన్స్‌లర్ కూడ ఏ యూనివర్సటీలో కూడా ఇంత పని చేయరు. ఒక ప్రొఫెసర్ కంటే ఎక్కువ పని చేస్తూ ఉంటారు. అలాంటి వైస్ చాన్స్‌లర్స్‌ను మీరు సద్వినియోగ పరచుకోండి. ఇలాంటి అవకాశం మీకు దక్కటము చాలా అదృష్టము. కాని వైస్ చాన్స్‌లర్‌కి కూడను ఇలాంటి పిల్లలు దక్కటము కూడ అదృష్టమే. పిల్లలు కూడను చాలా మంచివారు. ఇలాంటి మంచి పిల్లలు చిక్కరు. అహల్యవంటి రాయికి రామపాదము తాకినప్పుడే శాపవిమోచనము జరుగింది. సద్బుద్ధి కలిగినటువంటి పిల్లలు లేకపోతే ఆ సదాచార సంపన్నులైన వైస్ చాన్స్‌లర్స్ మనకు దక్కరు. ఇక్కడనుండి ప్రారంభమైనటువంటి విద్యార్థులు యావద్భారతదేశమే కాకుండా అన్ని దేశములు కూడను ప్రవేశించి ఈ ఆదర్శాన్ని చాటి విద్యయొక్క నిజ తత్వాన్ని బోధించి, సరియైనటువంటి అభివృద్ధిని సాధించాలి. తప్పక మీరు సాధిస్తారు. అలాంటి జ్యోతులే మీరు. ఈ జ్యోతులు మనము పుట్టించినప్పుడే దేశమంతయు పవిత్రమైనటువంటి ప్రకాశమును అనుభవిస్తుంది. మీరు ఉత్తమ పౌరులుగా తయారుకావాలి. భావి భారత ఉద్ధారకులుగా తయారుకావాలి. ఎందుకంటే భారతదేశము ఇప్పుడు ఉన్నటువంటి పలిస్థితులలో చాలా క్రుంగి పోతున్నాది. కనుక మీరు అభివృద్ధి పొందినారంటే, మీవలన దేశము కూడ బాగుపడుతుంది. దేశముయొక్క

sri sathyasai vahini

మంచిచెడ్డలన్నియును కూడను మానవునియొక్క ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటున్నాయి. మీరు సద్గుణవంతులైపోయి, సదాచార సంపన్నులు అయినప్పుడే మీరు తప్పక దేశమును బాగుపరుస్తారు.

విద్యార్థులారా! మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోవటంకోసం మీరు ఇక్కడకు రాకూడదు. దేశాన్ని కూడా ఉద్ధరించాలి. సమాజాన్ని కూడా ఉద్ధరించాలి. అప్పుడే మీయొక్క చదువు సార్థకము అవతుంది. ఏ ఒక్క దురాశలకు మీరు పోనక్కరలేదు. ఒక్కటే ఆశ. భారతదేశము చక్కని ప్రాచీన సంస్కృతిని మనము సాధించాలి, అనేటువంటి పట్టుదలను స్వీకరించాలి.

**విదేశీయ విద్వాంసులంతా భారతదేశ పవిత్రతను గుర్తించినవారే**

పూర్వము Einstein లాంటి సైంటిస్టులు ఉండేవారు. Max Muller ఎన్ని పర్యాయములో స్మరించాడు. నేను మరణించే సమయములోపల భారతదేశము పోయి మరణించాలి అన్నాడు. ఈ భారతదేశములో ఉండే పవిత్రత మరి ఏ దేశములో కూడా లేదు అన్నాడు. ఆ ధూళిలోపల కరుణ ఉంటుంది అన్నాడు. ఆ గంగలోపల ప్రేమ ఉంటుంది అన్నాడు. ఆ మట్టిలోపల కరుణ ఉంటుంది అన్నాడు. అలాంటి దేశములో పోయి నేను మరణించాలి అన్నాడు. కాని ఆశించిన తత్క్షణమే అన్నీ నెరవేరుతుంటాయా? కాని అతనికి లభ్యము కాలేదు. కనుక భారత పుత్రులు అయినటువంటి మీరు ఎంత అదృష్టవంతులు. ఇలాంటి పుత్రులను కన్నటువంటి ఆ తల్లిని కంటి నీరు మనము కార్చనీయకూడదు. కనుక ఆమెను సంతోషపెట్టడానికి మీరు తగినటువంటి సాహసాన్ని, త్యాగాన్ని మీరు పూనాలి. కేవలము ఒక భారతదేశమే అనుకోకూడదు. అంతా మన దేశమే. ఒక్క పెద్ద గృహముగా ఉంది. ఈ గృహములో అనేక రూములు ఉన్నాయి. ఒక రూము అమెరికా, ఒక రూము జర్మనీ, ఒక రూము జపాను ఈ విధముగా ఒక్కొక్క పేరు పెట్టుకున్నారు. కాబట్టి ప్రపంచమంతా ఒక్క గృహమే. విశ్వకుటుంబమే. భారతదేశము కూడ ఒక్క రూము. కాబట్టి ఒక్క రూములో ఉంటున్నావు నీవు. ఆ రూముయొక్క క్షేమమే నీవు కోరకూడదు. అన్ని రూములయొక్క క్షేమాన్ని నీవు కోరాలి. అన్ని రూములలో ఉన్నటువంటిది నీ అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు. Brotherhood of man and fatherhood of God. ఈ రెండింటిని మీరు

srisathyasaivachanamrutam

పెంచుకోవాలి. ఈ రెండింటిని పెంచుకుంటే దేశమంతా బాగుపడుతుంది. తిరిగి ప్రాచీనమైనటువంటి మన సంస్కృతిని ఉద్ధరించడానికి తగినటువంటి కంకణము కట్టుకోవాలి.

ప్రేమస్వరూపులారా! ఈనాడు నేను మాట్లాడకూడదు అనుకున్నాను. కాని మీకు నిరాశ పెట్టటము నాకు ఇష్టము లేక నేను అధికముగా మాట్లాడినాను. ఇన్నింటియందు మీరు స్వామి వాక్యాన్ని ఏమాత్రము మీరు వ్యర్థము చేయరని నాకు తెలుసు. ఇంట్లో ఏ సమయము చిక్కినప్పుడు ప్రేమను ఆచరణలో పెట్టి, దానిని అనుభవించి పదిమందికి అందించడానికి ప్రయత్నించండి. మీయందు ప్రేమను మాత్రము పెంచుకోండి. ప్రేమ ఉంటే ఇంక ఏదీ అక్కడ ప్రవేశించడానికి వీలులేదు. మనము హృదయము Single chair, not double sofa, not musical chair. ఈ ఒక్క చైర్ చాలు. అదే దయగల హృదయము ప్రేమతో ఉండేటటువంటిది. కనుక ప్రేమను మీరు పెంచుండి.

**(తేదీ 08-10-1998న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam